తన్నో దుర్గా ప్రచోదయాత్!



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..



సిద్ధార్థ ప్రాంగణంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శ్రీ గంగానమ్మ దేవాలయంలో..

- ఘనంగా కొనసాగుతున్న శరన్నవరాత్రులు
- దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారు దుర్గమ్మగా దర్శనమిచ్చారు. కార్యక్రమాలను అభివృద్ధి కమిటీ కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ పర్యవేక్షించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన దుర్గాదేవిగా అలంకరించారు.

దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం..

బావాజీపేట నాలుగో లైనులో శ్రీదేవీ ధర్మప్రచారపరిషత్ బచ్చుమాధవీమురళీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత దంపతులు పాల్గొని పూజలు చేశారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో..

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో కొలువైన శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అన్నపూర్ణాదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతల గోత్ర నామాలతో హోమాలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈవో వై.సీతారామయ్య, వంశపారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.



దుర్గాపురంలో నిర్వహిస్తున్న అమ్మవారి పూజల్లో భక్తులు

కొండాలమ్మ సేవలో తిరుపతమ్మ దంపతులు..

పాయకాపురం(విజయవాడరూరల్): శరన్నరాత్రి మహోత్సవాల్లో భాగంగా కండ్రిక కొండాలమ్మ అమ్మవారు మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 64వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ దంపతులు ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ పెద్దలు ఆలయ మర్యాదలతో ఆమెను ఘనంగా సత్కరించారు. రాజీవ్ నగర్ లోని నిదానంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారు, సుందరయ్యనగర్‌లోని శ్రీ వాసవీ మాత ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



బావాజీపేటలో సామూహిక కుంకుమార్చనలు



కండ్రిక కొండాలమ్మ పూజల్లో తిరుపతమ్మ దంపతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సిద్ధార్థ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం దుర్గాదేవి అమ్మవారిని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

క్లుప్తంగా

అమ్మవారి సేవలో కృష్ణంరాజు సతీమణి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో రెబల్‌స్టార్ కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలదేవి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రభాస్ ఫ్యాన్స్ నాయకులు నున్న శివ నాగేశ్వరరావు, యు.కనకరావు, డి.మురళీకృష్ణంరాజు శ్యామలదేవిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఫ్యాన్స్ వివరించారు. కార్యక్రమంలో మన్నం వెంకటేశ్వరావు, గుర్రం సుబ్బారావు, విజయ సారథి, కార్తీక్, గణేష్, అనిల్ యాదవ్, మల్లినేని రమణయ్య, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.


స్వయం ఉపాధిలో శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు అక్టోబర్ మూడో తేదీ నుంచి వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రస్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్ మేకర్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, కటింగ్ అండ్ టైలరింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏయిర్ కండీషనర్ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్‌క్రాఫ్ట్స్ మేకింగ్, జామ్, జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, స్మోకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో కాని, 0866-2470420 నంబరును కాని సంప్రదించాలని ఆమె కోరారు.

రైల్వే టికెట్ రిజర్వేషన్‌లో ఫోన్ నంబర్ తప్పనిసరి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్ఎస్) కౌంటర్‌లలో రిజర్వేషన్ టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా చేస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు జారి చేసింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే చర్యల్లో భాగంగా వారితో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడంతో పాటుగా ప్రయాణ సమయంలో అవసరమైన సహాయం, అత్యవసర సేవలకు ఇది ఎంతో ఉపయోగంగా ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రిజర్వేషన్ చార్ట్ తయారు తరువాత వెయిటింగ్ లిస్ట్ టికెట్ల స్థితి, రైళ్ల రాకపోకలు, ఆలస్యం, మళ్లింపు, రద్దు, రైళ్ల అంతరాయాలు తదితర సమాచారం ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఈ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకుని టికెట్ల రిజర్వేషన్ సమయంలో ఫారంలో ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసి సురక్షితమైన ప్రయాణాన్ని కొనసాగించాల్సిందిగా అధికారులు కోరారు.

హృద్యంగా సాగిన వీణా వాద్యకచేరి



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివ రామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో మంగళవారం నిర్వహించిన వీణా వాద్యకచేరి హృద్యంగా సాగింది. జీవీఆర్ నృత్య సంగీత కళాశాల విద్యార్థినులు వీణపై సంప్రదాయ కీర్తనలతో పాటు వాగ్గేయకార కీర్తనలను పలికించారు. శరన్నవరాత్రులలో భాగంగా శారదాదేవి రాజరాజేశ్వరిగా, బాలాత్రిపుర సుందరీ శ్రీదుర్గాదేవిగా, శ్రీ మహాలక్ష్మి ధైర్య లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో నిర్వహించిన కుంకమ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు దుర్గా సప్తశతి, చండీ హోమం కార్యక్రమాలను నిర్వహించారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం వీరుభట్ల ఫణికుమార్ నేతృత్వంలో వేద సభ, పండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సభను ప్రారంభించిన రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. వేదాలు భారతీయ ఆత్మగా అభివర్ణించారు. సర్వవేద సారం వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన విషయాలు వేదంలో వివరించారన్నారు. లోక శ్రేయస్సు కోసం 24 ఏళ్లుగా చండీ సప్తశతి యాగం నిర్వహిస్తునట్లు తెలిపారు. వేదపండితులు నాలుగు వేదాలను పారాయణం చేశారు. అనంతరం రమాసత్యనారాయణ దంపతులు పండితులను ఘనంగా సత్కరించారు.

వర్షంనీరు వెంటనే తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో కురిసిన వర్షానికి ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న దసరా నవరాత్రులకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వర్షం పడిన సందర్భంగా రోడ్లపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలని సూచించారు. నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీంలు అప్రమత్తంగా ఉంటూ వర్షం నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తోడేయాలని ఆదేశించారు. నగరంలోని రహదారుల్లో వర్షం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో సూపర్ సక్కర్లు, మోటర్లు, గల్పర్లతో తొలగించాలని చెప్పారు. మరుగుదొడ్ల పాయింట్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాటక అకాడమీ, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం కార్యక్రమంలో చింతా వెంకటరామాంజనేయులు కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. యువ సంగీత కళాకారిణి జి.శాంతి వాగ్గేయకారుల కీర్తనలను మధురంగా ఆలపించారు. సంగీత కళాశాల నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలను అభినయించారు. కాకినాడకు చెందిన తోట సుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన తోలు బొమ్మలాట ఆసక్తికరంగా సాగింది. భాషా సాంస్కృతిక శాఖ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి కార్యక్రమాలను పర్యవేక్షించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాగ మనోజ్ఞ, భన్విక సాయి, సంజనా రెడ్డిలు కూచిపూడి నాట్యాలను ప్రదర్శించారు. వెంకటేశ్వర్లు వీరనాట్యం అంశాన్ని ప్రదర్శించారు. డాక్టర్ పీవీఎస్ కృష్ణ ఖడ్గతిక్కన పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో అజయ్‌కుమార్ బృందం

లోకనాయకీ మనసాస్మరామి



నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు



నాట్య ప్రదర్శనలో జోస్యుల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, సంగీత విద్వాంసులు నృత్యసేవలో అమ్మను తరిస్తూ, ధ్యానిస్తూ పులకించారు. మంగళవారం కార్యక్రమంలో సూరంపల్లికి చెందిన రత్నకుమారి బృందం లయబద్ధంగా తాళం భజన చేశారు.

స్వరార్చన కార్యక్రమంలో భాగంగా వి.ఆశ్రిత, గుడిపాటి జయరాం సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన మాధవీ కృష్ణ, రూప నాగతేజశ్విలు భక్తి గీతాలను ఆలపించారు. ఎం.భార్గవి, సీహెచ్ కృష్ణ ప్రియ, పి.శ్రీవల్లి, ప్రవల్లిక, బెంగుళూరు చెందిన సి.దివ్య, నెల్లూరుకు చెందిన జాహ్నవి, గోనుగుంట్ల శైలశ్రీ, ఎం.రజితాదేవి, ఎం.వెంకటేష్, భావన, యల్లాజోస్యుల అనురాధా, జి.విజయగౌరి, కర్నూలుకు చెందిన సాయిలిఖిత, ఎన్.దివ్య సరస్వతీ, రమాదేవిలు కూచిపూడి, భరతనాట్యాలను ప్రదర్శించారు. ఆర్.రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించగా నిర్వాహకులు సైదా గంగాధర్ కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీషిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నృత్య కళాంజలి నాట్యాచార్యులు జోస్యుల శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం భరత నాట్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. 'గంధము పూయరుగా, గోకుల లీలయా.. కృపాలవాపాలయా, రంగపూజ, బ్రహ్మమొక్కటే, చక్కని తల్లికి ఛాంగు భళా' వంటి కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను రంజింప చేసింది. అలానే అనురాధా శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికలతో సత్కరించారు.

రేపు కబేళా, చేపల మార్కెట్లకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని కబేళా, చేపల మార్కెట్లకు సెలవు ప్రకటించినట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లలో జీవాలను వధించడం నిషేధించామని చెప్పారు. అనుమతి లేకుండా జీవాలను వధించినా, వ్యాపారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసివేసి వీఎంసీ సిబ్బందికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

కట్టుదిట్టం చేసినా ఆగని వీఐపీ దర్శనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో రద్దీ సాధారణంగా ఉన్నప్పటికీ అందరూ వీఐపీ దర్శనాలకే మొగ్గు చూపడంతో ఆలయ ప్రాంగణంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం వీఐపీ టైం స్లాట్‌కు గంట ముందు నుంచే వీఐపీల తాకిడి మొదలైంది. ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కాగా ఆ సమయంలో రూ.300, రూ.100 టికెట్లతో పాటు ప్రత్యేక క్యూలైన్లు ఖాళీగానే ఉన్నాయి. అయితే వీఐపీల పేరిట విచ్చేసిన వారందరూ గాలిగోపురం, సీఎం గేటులో నుంచే దర్శనం కోసం బారులు తీరారు. అదే సమయంలో ఆలయ ఈవో శీనా నాయక్ పరిస్థితిని సీసీ కెమెరాల్లో గమనించారు. గాలిగోపురం వద్దకు చేరుకున్న ఈవో సెక్యూరిటీ, పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ వీఐపీ, సీఎం గేటు ద్వారా దర్శనానికి పంపవద్దని హెచ్చరించారు.

దుర్గాదేవికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూజలు

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం, జీఎస్ రాజురోడ్డు, పోలీస్‌స్టేషన్ పక్కన గల శ్రీకనక దుర్గా అమ్మవారి దేవస్థానాన్ని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించగా, ఆలయ అర్చకులు ఆశీర్వాచనాలు అందజేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో మహాశక్తి స్వరూపం అయిన అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని విష్ణు అన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై సుభిక్షంగా ఉండాలని, పాడిపండటలతో, ఆయురారోగ్యాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

వైభవంగా షిర్డీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో షిర్డీసాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. మహోత్సవాల్లో భాగంగా బాబావారికి క్షీరం, గంధంతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, ఆంజనేయ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. మందిరంలో అధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అవినాష్ పేర్కొన్నారు. కార్యక్రమాలను మందిర అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, లఖంరాజు సునీత ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోమం కార్యక్రమంలో దేవినేని అవినాష్, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

భక్తిశ్రద్ధలతో మురాట్ల ఉత్సవం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి మురాట్ల ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, బేతాళ నృత్యాల నడుమ కాలనీ పుర వీధుల మీదుగా ఊరేగింపు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు మురాట్ల ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు, గౌరి పర్యవేక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు, సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



దావు బుచ్చయ్య కాలనీలో శ్యామలాంబదేవి









దుర్గామాతా పాహిమాం!

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఇంద్రకీలాద్రిపై వైభవోపేతంగా సాగుతున్నాయి. దుర్గాష్టమి సందర్భంగా జగజ్జననీ.. జగదాంబికా అయిన లోకనాయకి మంగళవారం త్రిశూలం ధరించి అభయమిస్తూ సింహ వాహనంపై దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లగా చూడు తల్లీ.. మళ్లీ వస్తామంటూ భక్తులు అమ్మ ముందు ప్రణమిల్లారు. పలువురు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. సాయంత్రం నగరోత్సవం అట్టహాసంగా జరిగింది. ఉత్సవాలను చూడటానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు కొండపై బారులు తీరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

